క్లుప్తంగా

తగ్గిన వేరుశనగ దిగుబడి



జుంజురాంపల్లి వద్ద పంటకోత ప్రయోగాలు చేస్తున్న అధికారులు

రాయదుర్గం: మండలంలోని జుంజురాంపల్లిలో అధికారులు సోమవారం వేరుశనగ పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. అయితే ఈ ఏడాది దిగుబడి తగ్గిపోయింది. దీంతో రైతులు పెట్టుబడి కూడా గిట్టుబాటుకాదని ఆందోళన చెందుతున్నారు. ఏఓ మహేంద్ర, సీనియర్ స్టాటికల్ ఆఫీసర్ శివశంకర్ ఆధ్వర్యంలో జుంజురంపల్లికి చెందిన రైతు గిడప్ప పొలంలో 2.100 కేజీలు, రైతు లక్ష్మానాయక్ పొలంలో 1.730 కేజీలు మాత్రమే దిగుబడి వచ్చింది. ఏఓ, స్టాటికల్ అధికారి మాట్లాడారు. ఏఈఓ ఆంజనేయులు, అగ్రి, హార్టికల్చర్ అసిస్టెంట్లు నాగరాజు, కాట్రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీపీకి ఘన సన్మానం



ఎంపీపీ లీలావతిని సన్మానిస్తున్న దృశ్యం

కణేకల్లు: స్థానిక ఎంపీపీ లీలావతికి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు సోమవారం సన్మానించారు. ఎంపీపీ చాంబర్‌లో సమావేశమైన జెడ్పీటీసీ డి.పద్మావతి, ప్రజాప్రతినిధులు ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కొత్త ఎంపీపీ లీలావతిని సన్మానించారు. సమష్టిగా పనిచేద్దామని ఎంపీపీ వారికి సూచించారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకోరావాలన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వాదంతో మనమంతా ప్రజాప్రతినిధులమయ్యామని, ఈ విషయాన్ని మరవొద్దని అన్నారు.

వసతులు కల్పించండి



మాట్లాడుతున్న ఎంపీపీ నారాయణ రెడ్డి

కూడేరు: ఆస్పత్రి అభివృద్ధి నిధులతో రోగులకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ నారాయణ రెడ్డి వైద్య సిబ్బందికి సూచించారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి సొసైటీ (హెచ్‌డీఎస్) కమిటీ సమావేశం జరిగింది. ఎంపీపీ నారాయణ రెడ్డి మాట్లాడుతూ పీహెచ్‌సీలో రోగులకు, సిబ్బందికి ప్రధానంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు లక్ష్మీనారాయణ, సౌమ్యా రెడ్డి, కమిటీ సభ్యులు డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రతాప్, ఎంపీడీఓ కుల్లాయిస్వామి, సర్పంచ్ లలితమ్మ, సూపర్ వైజర్ రవీంద్ర, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

కళ్యాణదుర్గం: పట్టణ సమీపంలోని ఓ నర్సరీ వద్ద గుర్తు తెలియని దుండగులు గుప్త నిధుల కోసం తవ్వారు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఉదయం గమనించిన నర్సరీ నిర్వాహకులు గుప్త నిధుల కోసం తవ్వినట్లు నిర్ధారించుకున్నారు. స్థానికులు కొందరు పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా పోలీసులు దీన్ని తోసిపుచ్చారు. నర్సరీలో పనిచేసే ఓ వ్యక్తే ఈ పనికి ఒడిగట్టాడని నిర్ధారించారు. అయితే స్థానికంగా పరిసర ప్రాంతాల్లో ఒక్క గుడి కూడా లేకపోవడం...కావాలనే తప్పుదోవ పట్టించేందుకు ఇలా ప్రయత్నించారని పోలీసులు చెప్పారు.

గుండె పోటుతో ఉపాధ్యాయుడి మృతి



టీచర్ రామ్మోహన్ (ఫైల్)

బ్రహ్మసముద్రం: పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రామ్మోహన్ (47) సోమ వారం గుండెపోటు తో మృతి చెందాడు. రామ్మోహన్ బ్రహ్మ సముద్రం మండలం రాయలదొడ్డి గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. కళ్యాణదుర్గంలో నివాసముంటున్నాడు. ఇంట్లో స్నానానికి వెళ్లాడు. ఆ సమయంలో ఛాతీలో నొప్పి వచ్చింది. గమనించి కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే రామ్మోహన్ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య నాగమణి, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. రామ్మోహన్ మృతి పట్ల ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు సంతాపం ప్రకటించారు.

నాణ్యమైన సేవలు అందించాలి

ఉరవకొండ: ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని ఎంపీడీఓ రవిచంద్ర, మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి సూచించారు. సోమవారం ఉరవకొండ ప్రభుత్వ సీహెచ్‌సీ ఆసుపత్రిని ఎంపీడీఓతో పాటు మలేరియా సబ్ యూనిట్ అధికారి, మేజర్ పంచాయతీ ఈఓ గౌస్‌సాహెబ్‌లు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి బంధువులను అడిగి వైద్య సేవల పై ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో ఎంపీడీఓ, అధికారులు సమీక్ష నిర్వహించారు.

మినీ బార్లు..ఊరూరా ఏరులు!

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో 'బెల్టు' తీశారు.. దినసరి కూలితో కుటుంబాన్ని నెట్టుకొచ్చే వారు..యారోజుకారోజు సంపాదన 'మత్తు'కు ఖర్చుచేస్తే ఇంటిల్లిపాదీ పస్తులుండాల్సి వస్తుందనే యోచనతో బెల్టుషాపులపై ఉక్కుపాదం మోపారు. ప్రభుత్వం మారింది.. ఇక 'ప్రభుత్వం మనదే .. నిర్భయంగా బెల్టు షాపులు నడుపుకోండి .. మీకేం కాదు .. ఏం జరిగినా మేం చూసుకుంటాం.. అధికారులతో మాట్లాకున్నాం.. మీకు షాపు కావాలంటే రూ.లక్ష అడ్వాన్స్ తీసుకు రండి? అడ్వాన్స్ లేకుండా పైరవీలు చేస్తే ఇచ్చేది లేదు.. లైసెన్సులకు రూ.లక్షలు పోశాం..మీరిచ్చిన దాంట్లోనే కొంత రికవరీ అవుతుంది.. అంటూ లాటరీ ద్వారా మద్యం షాపులు దక్కించుకున్న వ్యాపారులు బెల్టు దుకాణాలు నడిపేవారితో జోరుగా బేరం సాగించారు. మరికొన్ని గ్రామాల్లో ఆలయాలు, ఉత్సవాల పేరిట వేలం పాట నిర్వహించారు. ఇందులో టీడీపీ నాయకులు మాత్రమే పాల్గొనేలా ప్రకటనలు చేశారు. గతంలో ఎన్నడూలేని విధంగా బెల్ట్ దుకాణాలకు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షలకు వేలం పెంచినట్టు ఆయా గ్రామాల ప్రజలు చెప్పుకుంటున్నారు.

– రాయదుర్గం:

- ఊరూరా తెరుచుకున్న బెల్టుషాపులు
- నీరు దొరకని గ్రామాల్లోనూ విచ్చలవిడిగా ఏర్పాటు
- ఆదాయ 'మత్తు'లో తూలుతున్న 'తమ్ముళ్లు'
- రూ.లక్షల్లో పలికిన వేలం పాట
- 20 ఏళ్లుగా లేని గిరిజన గూడెంలోనూ బెల్టు దుకాణం



గుమ్మఘట్టలో పట్టుబడిన మద్యం బాటిళ్లను చూపుతున్న సీఐ, ఎస్‌ఐలు



కళ్యాణదుర్గం మండలం మల్లాపురంలో ఇటీవల వెలసిన బెల్టు దుకాణం

'గూడెం'లో ఇక నుంచి మద్యం

డీ హీరేహాళ్ మండలంలోని హెచ్ఎస్ తండా (గిరిజన గూడెం)లో గత ఇరవై ఏళ్లుగా లేని బెల్ట్ దుకాణం నెలకొల్పి స్థానికుల్లో తీవ్ర విమర్శలు మూట కట్టుకున్నారు. బెల్టు షాపు తొలగించాలని స్థానికులు ఎక్సైజ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల ముంగిటే మద్యం దొరుకుతుండడంతో రోజంతా సంపాదించిన సొమ్ము బాటిల్‌కే తగలేస్తూ ఇంటిల్లిపాది పస్తులుండాల్సిన సమయం వచ్చింది.

బెల్టు షాపులను కట్టడి చేస్తాం



బెల్టు షాపు నిర్వాహకులపై దాడులు నిర్వహించి, కేసులు నమోదు చేశాం. ప్రభుత్వ దుకాణాల తరహా చిల్లర కొట్లల్లో స్టాండ్‌లు ఏర్పాటు చేసి, మద్యం విక్రయాలు చేస్తే ఎంతటి వారైనా సరే..కఠిన చర్యలు తీసుకుంటాం. అధిక ధరలకు మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తాం. ఇందులో రాజీపడే ప్రసక్తే లేదు. దుకాణ యజమానులకు సైతం హెచ్చరికలు జారీ చేస్తాం. నిరంతరం నిఘా పెంచి బెల్ట్ షాపుల కట్టడికి చర్యలు చేపడతాం.

– సోమశేఖర్, ఎక్సైజ్ సీఐ, రాయదుర్గం

కర్ణాటక సరిహద్దునున్న రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని అర్బన్ సహా ఆయా మండలాల్లో 37 ప్రైవేట్ మద్యం దుకాణాలు తెరుచుకున్నాయి. వాటి పరిధిలోని అనధికారికంగా ఊరూరా మినీ బెల్ట్ బార్లు వెలిశాయి. కణేకల్లు మండలంలోని ఓ గ్రామంలో నిర్వహించిన వేలం పాటలో రూ.3 లక్షలకు టీడీపీ నాయకుడు దక్కించుకున్నాడు. డి హీరేహాళ్ మండలంలోని పలు గ్రామాల్లోనూ వేలం పాట ద్వారా కూటమి అనుయాయులే బెల్ట్ షాపులు సొంతం చేసుకున్నట్టు తెలుస్తోంది. మిగిలిన ప్రాంతాల్లోనూ ఇలాంటి విధానమే కొనసాగించారు. రూ.లక్ష అడ్వాన్స్ తీసుకొని కావాల్సిన మద్యం బ్రాండ్లు సరఫరా చేస్తున్నారు. కొన్ని చోట్ల గుడి, బడి అన్న తేడా లేకుండా బెల్టుషాపులు ఏర్పాటు చేసి, ఫూటుగా తాగించేస్తున్నారు. రూ.99 కే మద్యం బాటిల్ దొరకడం కాస్త కష్టమే అయినా.. మిగిలిన బ్రాండ్లు ఏది కావాలన్నా క్షణాల్లో చేతిలో పెట్టేస్తున్నారు. బాటిల్‌పై రూ.10 నుంచి రూ.20 అదనంగా వసూళ్లు చేస్తూ పేదల జేబులకు చిల్లు పెట్టేస్తున్నారు. తాగు నీరు లేని గ్రామాల్లోనూ మద్యం కొరత లేకుండా ఏరులై పారిస్తున్నారు.

అప్పట్లో బెల్టు రహిత గ్రామాలుగా తీర్చిదిద్దారు..

వైఎస్సార్‌సీపీ పాలనలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బెల్ట్ షాపులపై ఉక్కుపాదం మోపారు. మద్యం దూరం చేస్తేనే పేదల బతుకుల్లో మార్పు వస్తుందని భావించారు. ప్రభుత్వానికి రూ.వేల కోట్లు సమకూరుతుందని తెలిసినా అక్కచెల్లెమ్మల బాగుకోసం, పేదల జీవితాల్లో మార్పు కోసం ఈ మహమ్మారిని దూరం చేశారు. దీనిపై విష ప్రచారం చేసిన కూటమి ప్రభుత్వం.. తక్కువ ధరకే నాణ్యమైన మద్యం అందిస్తామని మందు బాబులను నమ్మించి వారితో ఒట్టు వేయించుకుంది. తీరా చూస్తే రూ.99కే మద్యం కొరత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. మందుకు అలవాటు పడినవారు అధిక ధర చెల్లించలేక, చూస్తూ వదులుకోలేక నిత్యం అష్టకష్టాలు అనుభవిస్తున్నారు.

బెల్టు తీసిన పోలీసులు?

రూ.లక్ష కొట్టు ..బెల్టు షాపు పట్టు శీర్షికన 'సాక్షి'లో సోమవారం కథనం ప్రచురితమైంది. దీనికి జిల్లా ఎస్పీ జగదీష్ సీరియస్ అయ్యారు. బార్లను తలపించే బెల్టు దుకాణాలపై ఉక్కుపాదం మోపేలా ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ, డీఎస్పీ ఉత్తర్వుల మేరకు రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ పలు ప్రాంతాల్లో మెరుపు దాడులు చేశారు. గుమ్మఘట్ట మండలంలో మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. అలాగే డీ హీరేహాళ్ మండలంలోని ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా సోదాలు చేశారు. మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశారు.

నేతల ఆశీస్సులు.. విచ్చలవిడిగా బెల్టుషాపులు

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలో ఇక తాగినోడికి తాగినంత మద్యం లభించనుంది. ప్రతి గ్రామానికీ మద్యం పంపిణీ చేసేందుకు ప్రజా ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. నూతన పాలసీ ప్రకారం ప్రైవేట్ మద్యం దుకాణాలకు ప్రభుత్వం లైసెన్సులు మంజూరు చేయగా, బెల్ట్ షాపుల ఏర్పాటుకు అధికార పార్టీ నేతలు అనుమతులిస్తున్నారు. నియోజకవర్గంలో 11 మద్యం దుకాణాలు ఉన్నాయి. అయితే మద్యం దుకాణాలను దక్కించుకున్న తెలుగు తమ్ముళ్లు సంబర పడుతున్నా.. లాటరీలో లక్కు తగలని తమ్ముళ్లు బెల్టు షాపుల కోసం ప్రజా ప్రతినిధి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. ఇదంతా కళ్లెదురుగా జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

పంచాయతీకి రెండు చొప్పున ఏర్పాట్లు..

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 74 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో ఒక్కో పంచాయతీకి రెండు నుంచి మూడు చొప్పున బెల్టు షాపులు ఏర్పాటు చేసేందుకు తెలుగు తమ్ముళ్లు సిద్ధమయ్యారు. ఇదంతా స్థానిక ప్రజాప్రతినిధి ఆశీస్సులతోనే దుకాణాలు వెలుస్తున్నట్లు విమర్శలున్నాయి. గతంలో గ్రామాల్లో వేలం వేసి మరీ బెల్టుషాపులు నిర్వహించేవారు. ఈ సారి పంచాయతీలో అధికార పార్టీ అనునాయులకు కట్టబెట్టేందుకు సిద్ధమయ్యారు. బెల్టుషాపుల్లో ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై అదనంగా రూ.50 వరకు వసూలు చేసుకునేందుకు అనుమతి ఇచ్చారు. దీంతో ఆయా పంచాయతీల్లో ఒక్కో బెల్టు దుకాణం నుంచి రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు వసూలయినట్లు టీడీపీ కార్యకర్తలు బహిరంగంగా మాట్లాడుకోవడం వినిపిస్తోంది.

వ్యాపారం దెబ్బతీసేలా...

నియోజకవర్గంలో మద్యం షాపులు దక్కించుకున్న వారి వ్యాపారం దెబ్బతీసేలా బెల్టు షాపులు వెలుస్తున్నాయి. అధికార ప్రజాప్రతినిధికి అనుచరులుగా ఉండి, మద్యం దుకాణాలను దక్కించుకున్న వారి నుంచే ఆయా మండలాల్లో బెల్టు షాపులకు మద్యం అందుతున్నట్లు సమాచారం. నియోజకవర్గంలోని అన్ని పంచాయతీల్లో మద్యం ఏరులై పారుతోంది. ఓ వైపు కూటమి ప్రభుత్వం మద్యం దుకాణానికి రూ.2 లక్షల వసూలు చేసింది. ఒక్కో లైసెన్సు నుంచి రూ.55 లక్షల నుంచి రూ.65 లక్షల వరకు ముక్కుపిండి వసూలు చేసింది. ఇదిలా ఉంటే టెండర్లు దక్కించుకొని మద్యం దుకాణాలను నడుపుతున్న వారి వద్ద నుంచి 20 నుంచి 30 శాతం వరకు తమకు కప్పం కట్టాల్సిందేనని టీడీపీ నేతలు హుకుం జారీ చేసినట్లు సమాచారం. ఇంత పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టి మద్యం దుకాణం నిర్వహించే వ్యాపారికి మాత్రం 20 శాతం మాత్రమే మార్జిన్ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

సజావుగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



సమస్యలను ప్రస్తావిస్తున్న కౌన్సిలర్లు

రాయదుర్గంటౌన్: పురపాలక సంఘం కార్యాలయంలో చైర్ పర్సన్ పొరాళ్ల శిల్ప అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం సోమవారం సజావుగా జరిగింది. ముందుగా అజెండాలోని 21 అంశాలను మున్సిపల్ సిబ్బంది చదివి వినిపించగా, కొన్ని అంశాలను కౌన్సిలర్లు కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. కౌన్సిలర్ గోవిందరాజులు మాట్లాడుతూ కుక్కలకు వ్యాక్సిన్ ఇచ్చేందుకు ఒక్కో కుక్కకు రూ.2 వేలు ఖర్చు చేయడంపై అభ్యంతరం తెలిపారు. పాతబస్టాండ్ ఎదురుగా ఉన్న 11 మున్సిపల్ షాపు రూములకు మార్చి దాకా రెన్యూవల్ అనుమతి ఇచ్చి, తర్వాత రద్దు చేయాలని, ఆ స్థలంలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని 1వ అంశంపై కౌన్సిలర్లు బండి అజయ్, గోవిందరాజు సూచించారు. అనంతరం కౌన్సిలర్లు, చైర్‌పర్సన్ ఏకాభిప్రాయంతో 2వ అంశం మున్సిపల్ పాఠశాల భవనం లీజును రద్దు చేస్తూ మిగతా అంశాలను అంగీకరిస్తూ ఏజెండాను ఏకగ్రీవంగా ఆమోదించారు. కమిషనర్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యాక్సినేషన్ ద్వారా కుక్కల బెడదను తగ్గిస్తామన్నారు. ఒకటో వార్డు కౌన్సిలర్ భీమనపల్లి నాగవేణి లేటర్ ద్వారా చైర్‌పర్సన్ దృష్టికి వార్డు సమస్యలను తెచ్చారు. కౌన్సిలర్లు గోవిందరాజులు , బండి అజయ్ సమస్యలను కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. సమావేశంలో మున్సిపల్ డీఈ రవి ప్రకాష్ నాయుడు, టీపీఎస్ మురళీమోహన్, ఏఈ ప్రతాప్ పాల్గొన్నారు.

న్యాయం కోసం స్టేషన్‌కెళ్తే లంచం అడుగుతున్నారు

- పట్టణ పోలీసు స్టేషన్ ఎదుట బాధితుల ధర్నా



పట్టణ పోలీసు స్టేషన్ ఎదుట ధర్నాకు దిగిన బాధితురాలు ప్రియాంక, ఎంఆర్‌పీఎస్ నాయకులు

కళ్యాణదుర్గం: తనకు అన్యాయం జరిగిందని పోలీసులను ఆశ్రయిస్తే లంచం ఇవ్వాలని అడుగుతున్నారని ప్రియుడి చేతిలో మోసపోయిన ఓ యువతి కుటుంబ సభ్యులు, ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి కళ్యాణదుర్గం పోలీసు స్టేషన్ ఎదుట సోమవారం ధర్నాకు దిగింది. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లికి చెందిన హరిజన ప్రియాంక అనే యువతిని కర్ణాటక రాష్ట్రానికి చెందిన చింతపండు వ్యాపారి సాయి తేజ అనే యువకుడు ప్రేమ పేరుతో పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి, ఆమెను లోబర్చుకొని కాలం వెళ్లదీస్తున్నాడు. ప్రస్తుతం ఆ యువతి 8 నెలల గర్భిణి. పెళ్లి చేసుకోవాలని అడిగితే తప్పించుకొని తిరుగుతున్నాడని కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 26న పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇందుకు అప్పట్లో స్పందించిన పట్టణ సీఐ వెంకటరమణ అన్యాయం చేసిన సాయితేజతో రూ.5 లక్షలకు ఒప్పందం కుదుర్చుకొని అతనిపై చీటింగ్ కేసు పెట్టి వదిలివేసినట్లు బాధితురాలు వాపోయింది. బాధితురాలికి జరిగిన అన్యాయాన్ని తెలుసుకున్న ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ సాకే గురుమూర్తి నాయకులు, బాధిత మహిళతో కలిసి పట్టణ పోలీసు స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. పట్టణ సీఐ వెంకటరమణను అడగ్గా.. బాధితురాలు ప్రియాంక తనను మోసం చేశారంటూ సాయితేజపై ఈనెల 26న ఫిర్యాదు చేసిందన్నారు. అతనిపై కేసు నమోదు చేశామన్నారు. నిందితుడు లంచం ఇచ్చాడన్నది ఆరోపణలేనని, వాస్తవం కాదన్నారు.

వాల్మీకి మహర్షి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య



వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న అంబికా

కంబదూరు: వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శమని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య అన్నారు. సోమవారం మండలంలోని చెన్నంపల్లి గ్రామంలో వాల్మీకులు వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి వారు వేర్వేరుగా హాజరై, వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వాల్మీకులందరూ ఐక్యంగా ఉంటూ హక్కులను సాధించుకోవాలన్నారు. మహిళలు పెద్ద ఎత్తున జ్యోతులు, బోనాలతో ఊరేగింపుగా వెళ్లారు. గ్రామంలో తాగునీటి సౌకర్యం, డ్రైనేజీ, బస్ షెల్టర్ వంటి మౌలిక వసతులు కల్పించాలని గ్రామస్తులు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, సర్పంచులు రాజగోపాల్, అమర్, ఎంపీటీసీ నరేంద్ర వాల్మీకి సంఘం నాయకులు గొట్లూరు చంద్ర, డీస్ మూర్తి, తలారి ఎర్రిస్వామి, కుట్టిమద్ది రమేష్ పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండల కేంద్రంలోని వాల్మీకులు మహర్షి వాల్మీకి జయంతి పురస్కరించుకుని సోమవారం మహర్షి వాల్మీకి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి పూజలు చేశారు. అనంతరం ట్రాక్టర్‌లో పూలతో వాల్మీకి చిత్రపటాన్ని ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమంలో భాగంగా వాల్మీకి సర్కిల్ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాల్మీకి యువసేన సభ్యులు, వాల్మీకి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి ఆఖరులోపు పన్ను వసూలు చేయాలి



కొనకొండ్ల సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న డీపీఓ నాగరాజునాయుడు

వజ్రకరూరు: ఫిబ్రవరి ఆఖరులోపు ఇంటిపన్ను, నీటి పన్ను వసూళ్ల వందశాతం పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) నాగరాజునాయుడు అధికారులను ఆదేశించారు. సోమవారం కొనకొండ్ల గ్రామంలోని గ్రామ సచివాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) తనిఖీ నిర్వహించారు. గ్రామ సచివాలయంలోని పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం గ్రామసచివాలయంలో పని చేస్తున్న సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ ఉద్యోగులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. డీపీఓ మాట్లాడుతూ 2025 ఫిబ్రవరి ఆఖరులోపు ఇంటి పన్నులు, నీటి పన్ను వసూలు పూర్తి చేయాలన్నారు. గ్రామంలో ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వజ్రకరూరు గ్రామ సచివాలయాన్ని కూడా డీపీఓ తనిఖీ చేశారు. కార్యక్రమంలో గ్రామకార్యదర్శి ఎంవీ ప్రసాద్, సచివాలయ ఉద్యోగులు, పంచాయతి ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ట్రూఅప్ చార్జీలతో ప్రజలపై భారం తగదు

రాయదుర్గంటౌన్: ట్రూ అప్ చార్జీల పేరిట విద్యుత్ వినియోగదారులపై మోయలేని భారం వేయడం కూటమి ప్రభుత్వానికి తగదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నాగార్జున అన్నారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయం ముందు సీపీఐ నాయకులు నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కొ్ట్రేష్, నరసింహులు, దుర్గన్న పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

కూడేరు: సాగు పట్టాలివ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో అరవకూరు రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణమూర్తి మాట్లాడారు. పేద రైతులు సుమారు 30 మంది వరకు 40 ఏళ్లుగా పంటలు సాగు చేసుకుంటున్నారని, సాగు పట్టాలు కోసం కొన్నేళ్లుగా రైతులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా అధికారులు పట్టించుకోలేదన్నారు. అనంతరం డీటీ సూర్యప్రతాప్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశులు, నాయకులు కరీం, మల్లికార్జున, వీరప్ప, చిదంబరమ్మ, లక్ష్మీదేవి, చిన్నా, అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ర్యాలీ, ధర్నా

రాయదుర్గంటౌన్: మున్సిపల్ రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె చేస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున హెచ్చరించారు. రాయదుర్గం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలియజేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద బైఠాయించి, ధర్నా చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక యూనియన్ నాయకులు రాము, మల్లేష్, తిప్పేస్వామి, ఎర్రిస్వామి, బసవరాజు, సిద్దలింగ, తిప్పేరుద్ర, ఆదిలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పారిశుధ్య కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

కళ్యాణదుర్గం: మున్సిపల్ శాఖలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలియజేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసనలో పారిశుధ్య కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శివ, వన్నూరుస్వామి మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో 62 మంది పారిశుధ్య కార్మికులు ఉండగా, కేవలం 48 మంది మాత్రమే పనిచేస్తున్నారన్నారు. మిగిలిన వారిని కూడా విధులకు హాజరయ్యేలా చూడాలని కోరారు. కార్మికుల నిరసనకు ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు వంశీ మద్దతు తెలిపారు. మున్సిపల్ కార్మికులు వెంకటేష్, తిమ్మప్ప, నటరాజ్, రమణ, అలివేలమ్మ పాల్గొన్నారు.

ఉపాధి హామీ అక్రమాలను నిగ్గుతేల్చాలి

ఉరవకొండ: మండలంలో ఉపాధి హామీ కింద జరిగిన పనుల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, అక్రమాలు నిగ్గుతేల్చాలని కాంగ్రెస్, సీపీఎం ఆధ్వర్యంలో ఉరవకొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. కాంగ్రెస్ నాయకులు సోనియాశీనా, బ్యాళ్ల ప్రసాద్, సీపీఎం నాయకులు మధు, రంగారెడ్డి మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ మహబూబ్‌బాషాకు వినతి పత్రం అందించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

కళ్యాణదుర్గం: మహిళలు అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. పట్టణంలోని స్థానిక టీ సర్కిల్‌లో సోమవారం స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన చేతివృత్తుల విక్రయ మార్కెట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం టీడీపీ నాయకుడు నాగేశ్వర యాదవ్, మెప్మా సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

వివేకానంద కళాశాలపై చర్యలు తీసుకోండి

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గంలోని వివేకానంద ప్రైవేట్ కళాశాలలు (డిగ్రీ, ఇంటర్ కళాశాలలు) యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి,నిరుద్యోగుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు టీపీ రామన్న కోరారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆయన ఐక్యవేదిక నాయకులు, విద్యార్థులతో కలిసి ఇన్‌ఛార్జ్ ఆర్డీఓ బి.వినూత్నను కలిసి విన్నవించారు. ఇన్‌చార్జ్ ఆర్డీఓ బి.వినూత్న సానుకూలంగా స్పందించి, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు సందీప్, శివకుమార్, భరత్, ప్రకాష్, దిలీప్, బాలు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో విద్యుత్ అంతరాయం

రాయదుర్గంటౌన్: పట్టణంలో సోమవారం సాయంత్రం 5:30 గంటల నుంచి విద్యుత్ అంతరాయం కలగడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. సబ్‌స్టేషన్‌లో రిలే ఫెయిల్యూర్ కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. డీఈ శ్రీనివాస నాయు డు, ఏఈ బాలచందర్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో మరమ్మతు పనులు చేయించారు. గంటన్నర తరువాత విద్యుత్ సరఫరా అయ్యింది.

శుభకార్యం



వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, మెట్టు గోవిందరెడ్డి

కణేకల్లు: కణేకల్లులోని చిక్కణ్ణేశ్వరస్వామి ఫంక్షన్ హాలులో సోమవారం జరిగిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆదిసద్గురు జయరామిరెడ్డి కుమారుడు రాజశేఖర్‌రెడ్డి, సుమతి పెళ్లి రిసెప్షన్‌కు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతువిభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, మాజీ సర్పంచు పాటిల్ చెన్నకేశవ రెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్ప చౌదరి, మారెంపల్లి మారెన్న, వై.చంద్రమోహన్‌రెడ్డి, కన్వీనర్ చిక్కణ్ణ, నాయకులు యంగ్రకాయల వన్నూరప్ప, ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, తుకారాం, డాక్టర్ సోమన్న పాల్గొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుల బైండోవర్

గుమ్మఘట్ట: మండలంలోని జె.వెంకటంపల్లి, గలగల, కేపీదొడ్డి, తాళ్లకెర,గొల్లపల్లి గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్న ఆరుగురు నిర్వాహకులను తహసీల్దార్ శ్రీనివాసులు వద్ద సోమవారం బైండోవర్ చేసినట్లు ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు.

బాలికల భద్రత అందరి బాధ్యత

కంబదూరు: బాలలపై జరుగుతున్న లైంగిక వైధింపులు, దాడులు, బాల్య వివాహాలను అరికట్టడం అందరి బాధ్యత అని సీడీపీఓ వనజ అక్కమ్మ అన్నారు. సోమవారం మండలంలోని పాళ్లూరు గ్రామంలో ఐసీడీఎస్, ఆర్డీటీ ఆధ్వర్యంలో బాలికల భద్రత-సామాజిక బాధ్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏటీఎల్ ఆదినారాయణ, ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి, సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, జీఎంఎస్‌కే ఇందిర, అంగన్‌వాడీ కార్యకర్తలు రజని, కళావతి, మానసవీణ, సిద్దమ్మ, హనుమక్క, నిర్మల, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు సమాచారమివ్వకపోతే ఎలా?

కణేకల్లు: ప్రభుత్వ కార్యక్రమాలకు సమాచారం ఇవ్వకపోతే ఎలా? అని ఎంపీపీ యు.లీలావతి అధికారులను ప్రశ్నించారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ లీలావతి అధ్యక్షతన జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశంలో చర్చించిన సమస్యలను తిరిగి వచ్చే సమావేశం నాటికి పరిష్కరించాలన్నారు. జెడ్పీటీసీ డి.పద్మావతి మాట్లాడుతూ ప్రజలకు ఏ కష్టమొచ్చినా ఎంపీటీసీలు, సర్పంచులు అండగా నిలవాలన్నా రు. విద్యుత్‌శాఖ అధికారులు సమావేశానికి డుమ్మాకొడుతుండడంతో సభ్యులు ప్రకాష్‌చౌదరి, భాస్కర్‌రెడ్డి, ఫణీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ ఫణికుమార్, ఏఓ శ్రవణ్‌కుమార్, పీఆర్ జేఈ జగ దీష్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శివరామకృష్ణారెడ్డి, ఏపీఓ సుధాకర్, సర్పంచు రామాంజనేయులు,డాక్టర్లు నిరీషా, మనోహర్, విజయకుమార్‌నాయక్ హాజరయ్యారు.

పారిశుధ్యం మెరుగుపరచండి

వజ్రకరూరు: పారిశుధ్యం మెరుగునకు కృషి చేయాలని డీఎల్‌డీఓ విజయలక్ష్మి అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. సోమవారం స్థానిక గ్రామ సచివాలయాన్ని డీఎల్‌డీఓ విజయలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని పలు రికార్డులను డీఎల్‌డీఓ పరిశీలించారు. గ్రామ సచివాలయంలో అందుతున్న సేవలపై ఆరాతీశారు. డీఎల్‌డీఓ మాట్లాడుతూ పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం డీఎల్‌డీఓ విజయలక్ష్మిని సర్పంచు మోనాలిసా సన్మానించారు. ఈఓఆర్డీ దామోదర్‌రెడ్డి, గ్రామకార్యదర్శి మల్ల య్య, ఉద్యోగులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు తప్పనిసరి

బెళుగుప్ప: జీవాలకు నట్టల నివారణ మందు తాపించాలని ఉరవకొండ డివిజన్ పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకుడు వెంకటేశ్ తెలిపారు. సోమవారం ఆయన బెళుగుప్పలోని గొర్రెల పెంపకందారులు కంబెప్ప, వెంకటేశులుకు చెందిన సుమారు 700 జీవాలకు నట్టల నివారణ మందును వేయడాన్ని ఉపసంచాలకులు పరిశీలించారు. అనంతరం బెళుగుప్ప-2 రైతు సేవా కేంద్రం, హనిమరెడ్డిపల్లి, గంగవరం కేంద్రాలకు వెళ్లి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పశు వైద్య కేంద్ర వైద్యాధికారి రమేష్, సిబ్బంది ఎర్రిస్వామి, అశోక్, అనిల్ పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాల ఏర్పాటు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో 12 టపాసుల విక్రయ దుకాణాలు వెలిశాయి. అనుమతులు రాకముందే వ్యాపారులు సోమవారం నుంచే దుకాణాల ఏర్పాటు చేసి సరుకులు విక్రయానికి ఉంచారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రమాదాలకు ఆస్కారం ఇచ్చేలా కొందరు దుకాణం లోపల, చుట్టూ క్లాత్ కర్టన్ ఏర్పాటు చేశారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే వ్యాపారులు ఇష్టారాజ్యంగా దుకాణాలు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. దుకాణాలు ఏర్పాటు చేస్తున్నా మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ట్రేడ్ లైసెన్సు ఫీజులు కూడా అధికారులు వసూలు చేయని పరిస్థితి. ప్రభుత్వ నిబంధనలను బాణ సంచా విక్రయదారులు తప్పనిసరిగా పాటించాలని తహసీల్దార్ నాగరాజు ఆదేశించారు. అనుమతులు ఇచ్చిన దుకాణాదారులు షాపుల వద్ద అగ్నిమాపక పరికరాలు, నీళ్ల తెట్టె, పొడి ఇసుక బకెట్లు ఏర్పాటు చేయాలన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడి మృతి

కూడేరు: కరుట్లపల్లికి చెందిన నరేష్ (30) అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. భార్య నాగలక్ష్మి వివాహేతర సంబంధం కొనసాగిస్తోందని నరేష్ ఈనెల 25 ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన విషయం విదితమే. సీఐ శివరాముడు మాట్లాడుతూ మృతుడి తండ్రి గోవింద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.